## క్లుప్తంగా

### వాటర్ ప్లాంట్‌ను పరిశీలించిన డీఈ

మాకవరపాలెం: మండలంలోని వజ్రగడలో వృథాగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంటును శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జయరాం పరిశీలించారు. గ్రామస్తులకు శుద్ధ జలాలు అందించేందుకు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ చాలా కాలంగా నిరుపయోగంగా ఉంది. ఈ నేపథ్యంలో స్థానికుల విజ్ఞప్తితో శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పరిశీలించారు. దీనికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

### జె.నాయుడుపాలెంలో 70 మందికి వైద్య పరీక్షలు


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

రోలుగుంట: మండలంలో జె.నాయుడుపాలెంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన 70 మంది రోగులకు బూరుగుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.చరిస్మా వైద్య పరీక్షలు చేశారు. వీరిలో పది మందికి రక్త పరీక్షలు చేసి, ఇద్దరికి జ్వరాలుగా గుర్తించారు. మరో 16 మంది జ్వరపీడితులకు చికిత్స చేసి తీసుకోవాల్సిన ఆహార నియమాలు సూచించారు. మిగతా వారికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

### ఎం.కోడూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ బాధ్యతలు


ఎం.కోడూరు పీఏసీఎస్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్, సభ్యులు

మాడుగుల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల(పీఏసీఎస్)కు ఏర్పాటు చేసిన నూతన త్రిసభ్య కమిటీలు బాధ్యతలు స్వీకరిస్తున్నాయి. మండలంలో ఎం.కోడూరు పీఏసీఎస్‌కు ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీలో చైర్‌పర్సన్‌గా ఎం.కోడూరుకు చెందిన పడాల చాణిక్య, కమిటీ సభ్యులుగా పినబోయిన సత్యనారాయణ, కురపా బాలరాజు శుక్రవారం సంఘ భవనంలో బాధ్యతలు స్వీకరించారు. సంఘ సీఈవో బంటు రామునాయుడు రిజిస్టారులో వారితో సంతకాలు చేయించారు.

### ఎం.కోడూరులో వీధి దీపాల ఏర్పాటు

మాడుగుల రూరల్: ఎం.కోడూరు గ్రామంలో వీధి దీపాలను వార్డు సభ్యురాలు కృష్ణవేణి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేశారు. స్థానిక 12వ వార్డు పరిధిలో ఎరకలపేట, ఎస్సీ కాలనీ పరిధిలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను 12వ వార్డు పంచాయతీ సభ్యురాలు పడాల కృష్ణవేణి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె భర్త, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు సొంత నిధులతో విద్యుత్ బల్బులతో పాటు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేశారు. శుక్రవారం ఎరకలపేటలో 7 స్తంభాలకు విద్యుత్ బల్బులు అమర్చారు. శనివారం ఎస్సీ కాలనీలో బల్బులు వేస్తామని తెలిపారు.

### కె.జె.పురంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు


కె.జె.పురంలో జంగిల్ క్లియరెన్స్ చేపడుతున్న సిబ్బంది

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామంలో పారిశుధ్య, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఈ నెల 20న మోదమాంబ జాతరను దృష్టిలో పెట్టుకుని పంచాయతీ సర్పంచ్ జామి రమణబాబు, కార్యదర్శి బి.నవీన్‌దొర పర్యవేక్షణలో రహదారికి ఇరువైపులా తుప్పలు, డొంకలను శుక్రవారం పొక్లెయిన్ సహాయంతో తొలగించారు. తాచేరు నది సమీపంలో జంక్షన్ నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారికి ఇరువైపులా తుప్పలను తొలగించారు. రోడ్లపై చెత్త, చెదారాలను శుభ్రం చేశారు. పంచాయతీ ఉప సర్పంచ్ సూరిశెట్టి గోవిందరాజులు, వార్డు సభ్యుడు ఆడారి వెంకట సూరిప్పారావు పాల్గొన్నారు.

### గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కొత్తకోట పిహెచ్‌సి వైద్య బృందం

రావికమతం: కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మోహిని సురేఖ ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా చీమలపాడు పంచాయతీ పరిధిలో కొంజూర్తి, పెదుంపాలెం గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. 38 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

# కంపుకొడుతున్న వీధులు

- పార్వతీపురంలో క్షీణించిన పారిశుధ్యం
- వీధి రోడ్లలో నిత్యం ప్రవహిస్తున్న మురుగునీరు
- వెంటాడుతున్న సీజనల్ వ్యాధులు


మురుగునీరు ప్రవాహం


పార్వతీపురం గ్రామంలో వీధి రోడ్డు దుస్థితి


కలుషితమైన బోరు నీటిని పట్టుకుంటున్న వ్యక్తి

నాతవరం: వీధులు కంపుకొడుతున్నాయి. నిత్యం మురుగునీరు వీధి రోడ్లలో ప్రవహిస్తోంది. ఇది మండలంలో చెర్లోపాలెం పంచాయతీ శివారు పార్వతీపురం గ్రామంలో దుస్థితి. వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో గ్రామస్తులు ఇంట్లో వాడే నీరు వీధుల్లో నిత్యం ప్రవహిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత నీటి ప్రవాహం పెరిగి దుర్గంధభరితంగా తయారైంది. బోర్లు, కుళాయిల నీరు కలుషితమవుతోంది. మరోవైపు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామస్తులు కలుషిత నీటిని తాగడం వల్ల తరచూ గ్రామస్తులు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో ప్రతి ఇంట్లో జ్వర పీడితులు ఉన్నారు.

గ్రామంలో కొందరు ఇంటి వద్ద ఉన్న మరుగుదొడ్డిలో వాడిన నీటిని సైతం వీధి రోడ్డుపైకి విడిచిపెడుతున్నారు. దీంతో ఆయా వీధుల్లో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కళ్ల ముందే నిత్యం ప్రవహించే మురుగునీటిని అరికట్టేవారు కరువయ్యారని గ్రామస్తులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. బోరులోకి మురుగునీరు చేరకుండా చర్యలు చేపట్టాలని, వీధుల్లో మురుగునీరు ప్రవహించకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పి.పార్థసారథిని వివరణ కోరగా.. పంచాయతీ విస్తరణాధికారి ఇటీవల బదిలీపై వెళ్లిపోయారని, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

## మూడు పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జుల నియామకం


అపిరెడ్డి మాణిక్యం నాతవరం


సన్యాసిదేముడు శృంగవరం


అంకంరెడ్డి నానిబాబు పి.కె.గూడెం

నాతవరం: మండలంలోని శృంగవరం, నాతవరం, పి.కె.గూడెంల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జులను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాతవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జీగా అపిరెడ్డి మాణిక్యంను నియమించారు. ఈయన గతంలో నాతవరం ఎంపీటీసీ సభ్యుడిగా పని చేశారు. శృంగవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జీగా సింగంపల్లి సన్యాసిదేముడును నియమించారు. ఈయన గతంలో ఎంపీపీగా పని చేశారు. పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జీగా అంకంరెడ్డి నానిబాబును నియమించారు. ఈయన గతంలో పి.జగ్గంపేట సర్పంచ్‌గా పని చేశారు.

## ముమ్మరంగా సాగుదారుల గుర్తింపు సర్వే


సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మాకవరపాలెం: బంజరు సాగుదారుల గుర్తింపునకు చేపట్టిన సర్వే ముమ్మరంగా సాగుతోంది. మండలంలోని రాచపల్లి రెవెన్యూలోని సర్వే నంబర్ 737లో సుమారు 1500 ఎకరాల బంజరు భూమి ఉంది. దీనిని గత 40 ఏళ్లకుపైగా రామన్నపాలెం, వెంకయ్యపాలెం, చినరాచపల్లి, రాచపల్లి, వెంకటాపురం, ధర్మవరం, మాకవరపాలెంతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు సాగు చేసుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో గత వారం రోజులుగా సాగుదారులను గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. సాగులో ఉన్న భూమి, రైతుల పేర్లను నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు 170 మంది రైతులు సాగు చేస్తున్న 350 ఎకరాల భూమిని సర్వే చేసినట్టు వీఆర్వో సాంబశివరావు శుక్రవారం తెలిపారు.

## పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ


రోలుగుంట: మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో పంచాయతీల అభివృద్ధిపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ లక్ష్మి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వర్రావు ప్రారంభించారు. పంచాయతీల అభివృద్ధికి శిక్షణ ఆవశ్యకతను ఎంపీడీవో వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఎస్.కాశీం పాల్గొన్నారు.

## 217 మంది విద్యార్థులకు గొడుగుల పంపిణీ


తామరబ్బ యూపీ స్కూల్‌లో సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు అందజేసిన గొడుగులతో విద్యార్థులు

దేవరాపల్లి: మండలంలోని చింతలపూడి, తామరబ్బ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భగవాన్ సత్యసాయి సేవా సమితి సభ్యులు గొడుగులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో గిరిజన గ్రామాల విద్యార్థులు పాఠశాలలకు వచ్చే సమయంలో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో భగవాన్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గొడుగులను అందజేసినట్లు సమితి సభ్యులు తెలిపారు. సోంపురం, కె.బొడ్డపాడు, తామరబ్బ, పల్లపుకోడాబు, బల్లిపురం, సమ్మెద, నేరెళ్లపూడి, చింతలపూడి పాఠశాలలకు చెందిన 217 మంది విద్యార్థిని, విద్యార్థులకు గొడుగులను శుక్రవారం పంపిణీ చేశారు. భగవాన్ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, జిల్లా గ్రామ సేవ సమన్వయకర్త బొడ్డు సుధాకర్ మౌళి, జిల్లా సేవా సహ సమన్వయకర్త కన్నూరు అప్పలనాయుడు, దేవరాపల్లి పూర్వపు మండల ఇన్‌చార్జి ఆదిరెడ్డి చినకన్నబాబు, కోరుకొండ పెంటారావు, చింతలపూడి ఎంపీటీసీ బండి గౌరమ్మ, కొట్టాన రాంబాబు పాల్గొన్నారు.

## షిర్డీ సాయి మందిరానికి ఇత్తడి మెట్లు బహూకరణ


సాయి సన్నిధిలో ఏర్పాటు చేసిన ఇత్తడి మెట్లు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని షిర్డీసాయినాథుడికి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు ఇత్తడి మెట్లను శుక్రవారం విరాళంగా అందజేశారు. గతంలో సాయినాథునికి ఇత్తడి సింహాసనం, మకర తోరణం, రాతి ద్వారం అందజేశారు. దాత శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి, స్వామి వారి చిత్రపటం బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు, శ్రీవారి భక్తులు పాల్గొన్నారు.

## పొలాలను పరిశ్రమలకు తీసుకోవద్దు


ఆర్లిలో రైతులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు దొరబాబు

కె.కోటపాడు : ఆర్లి, చింతపాలెం గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటుకు వ్యవసాయ భూములను ఇచ్చేది లేదని రైతులు చెబుతున్నా రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించడం తగదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. ఆర్లి, చింతపాలెం గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈజెడ్ నిర్మాణానికి కావాల్సిన 1200 ఎకరాల సేకరణకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అచ్యుతాపురం సెజ్‌లో ఎన్నో రసాయిన పరిశ్రమల్లో ప్రమాదాల బారిన పడుతూ పలువురు చనిపోతున్న సంఘటనలను చూస్తున్నామని ఆయన చెప్పారు. ఆర్లి, చింతపాలెం తదితర గ్రామాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేస్తే వ్యర్థాల విడిచి పెట్టేందుకు అనువైన ప్రాంతాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు, గొర్లె దేముడుబాబు, రెడ్డి అప్పలనాయుడు, సీముసురు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

చీడికాడ: పాఠశాల స్థాయిలో ఇష్టపడి చదివి, మంచి ఉత్తీర్ణత సాధించినప్పుడే ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకుంటాడని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బసు పోతన అన్నారు. తురువోలు జిల్లా పరిషత్ హైస్కూలులో నన్నయ్య విశ్వ విద్యాలయం పూర్వ కులపతి ముర్రు ముత్యాలునాయుడు ప్రోత్సాహంతో శుక్రవారం వ్యక్తిత్వ వికాసం, సమగ్రాభివృద్ధి అనే అంశంపై 9వ తరగతి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులు పది వారాల పాటు ప్రతి శుక్రవారం నిర్వహిస్తామని హెచ్ఎం రామకృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బోంజుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రత్నంపేటలో అగ్ని ప్రమాదం


దగ్ధమవుతున్న పశువుల పాక

రోలుగుంట: రత్నంపేట-గంగవరం మార్గంలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. రైతు నాగులాపల్లి గణేష్‌కు చెందిన పశువుల పాక దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గణేష్ ఎప్పటిలానే శుక్రవారం తన పొలం పనులు ముగించుకొని రాత్రి ఇంటికి వచ్చేశాడు. సుమారు రాత్రి 08.30 గంటల దాటిన తరువాత పాకల నుంచి మంటలు రావడంతో పొరుగు రైతులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లాడు. పాకలో ఉన్న రెండు ఆవులు, ఒక పెయ్యికు కట్లు విప్పేయడంతో అవి ప్రాణాల నుంచి బయటపడ్డాయి. పశువుల పాక పక్కనే ఉన్న గడ్డి కుప్ప కూడా పూర్తిగా దగ్ధమయ్యాయి.

## గ్రామాల పరిశుభ్రతకు సహకరించాలి


గరిశింగిలో చెత్తాచెదారాలను తొలగిస్తున్న ఎంపీడీవో సువర్ణరాజు, సర్పంచ్ గూడెపు రాము

దేవరాపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని స్థానిక ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు సూచించారు. ఈ మేరకు మండలంలోని గరిశింగి, చినగంగవరం గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ గూడెపు రాము, ఎంపీటీసీ కోలా వెంకటరమణ(గోపి), గ్రామస్తులతో కలిసి చెత్తా చెదారాలను తొలగించారు. ఆయా గ్రామాలలో డ్రైనేజీల్లో పూడికలు తొలగించి శుభ్రం చేశారు. అనంతరం స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసి హరిత రాయబారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ వి.పి.వి.త్రినాథ్, వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్, ఉపాధి హామీ ఈసీ వెంకటేష్, హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ ఎస్.భవ్యతేజ, వర్క్ ఇన్‌స్పెక్టర్ గోవింద, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికీ కూటమి నేతల మోసాలు

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పిలుపు
- వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం రేపు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


సమావేశానికి హాజరైన పార్టీ ముఖ్య నాయకులు

నర్సీపట్నం: అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి నేతల మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పిలుపునిచ్చారు. నర్సీపట్నంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం జరిగే నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు ముఖ్య నాయకులు హాజరు కానున్నారన్నారు. నాలుగు మండలాల నుంచి నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంపై దిశా, నిర్దేశం చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు పాలనలో అన్ని వర్గాలు మోసపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక చేతులెత్తేశారని మండిపడ్డారు. ఏడాదిలో ఒక సిలిండర్ మాత్రమే ఇచ్చి ఉచిత గ్యాస్‌ను అటకెక్కించారని విమర్శించారు. రైతులకు ఏడాదికి రూ.20 వేలు సాయం, 50ఏళ్లకు పెన్షన్, మహిళలకు నెలకు రూ.1500 ఎక్కడని ప్రశ్నించారు. జగనన్నకు వస్తున్న ప్రజాదరణ చూసి కూటమి నేతలు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. మన అధినేత ఎంత ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్తున్నారో.. అదే ఉత్సాహంతో మనమంతా మూడేళ్లు కష్టపడి పనిచేద్దామన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు మాట్లాడారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, రుత్తల సర్వేశ్వరరావు, గజ్జెలపు మణికుమారి, సాగిన లక్ష్మణ్‌మూర్తి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ మండల అధ్యక్షులు శానపతి వెంకటరత్నం, ఫణిశాంతరామ్, చిటికెల వెంకటరమణ, జిల్లా పార్టీ మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, జెడ్పీటీసీలు సుర్ల గిరిబాబు, అప్పలనర్స, పెట్ల భద్రాచలం, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలి


చౌడువాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి రామ్ చైతన్య, తదితరులు


నాతవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మండల ప్రత్యేకాధికారి మంగవేణి వైద్యసిబ్బంది


దేవరాపల్లిలో ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘన, తదితరులు


ఎ.కోడూరులో ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌ఎన్ ప్రమీల, తదితరులు


నర్సీపట్నంలోర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ


రావికమతంలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో మంగతాయారు, తదితరులు

కె.కోటపాడు : కుటుంబ నియంత్రణ పద్ధతులను ప్రజలు పాటించాల్సిన అవసరం ఉందని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రామ్ చైతన్య అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా చౌడువాడ గ్రామంలో గురువారం సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు. ఎ.కోడూరు గ్రామంలో లంకవానిపాలెం పీహెచ్‌సీ పీహెచ్ఎన్ ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నాతవరం: సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి జి.మంగవేణి అన్నారు. నాతవరం పీహెచ్‌సీ సిబ్బందితో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మెయిన్ రోడ్డుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు దృష్ట్యా ప్రస్తుతం గ్రామాల్లో జ్వరపీడితులు ఎక్కువగా ఉన్నారని, యుద్ధ ప్రాతిపదికన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో ఇన్‌చార్జి వైద్యాధికారి శబ్నం ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో కోరుప్రోలు వెంకటరమణ, పీహెచ్ఎన్ త్రివేణి, ఎంపీహెచ్‌వో పోలుపర్తి బైరాగి, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్య మేఘన ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీని పీహెచ్‌సీ నుంచి ప్రధాన రహదారి వరకు నిర్వహించారు. కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో సీహెచ్‌వో ఎం.ఆనంద్, పీహెచ్ఎస్ అప్పలనర్సమ్మ, హెచ్‌వీ లక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సీపట్నం: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్యశాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్డీవో వి.వి.రమణ, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ జ్యోతి ప్రారంభించారు. ఆర్డీవో కార్యాలయం నుంచి అబిద్‌సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా వల్ల కలిగే సమస్యలు, కుటుంబ నియంత్రణ, సమానత్వం వంటి వాటిపై అవగాహన కల్పించడమే ర్యాలీ ముఖ్య ఉద్దేశమన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ జనాభా అవసరమే కానీ పరిధికి మించిన జనాభా ఉంటే అక్కడ అభివృద్ధి జరగడం చాలాకష్టమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, సీడీపీవో జి.వి.రమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశలు పాల్గొన్నారు.

రావికమతం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో మంగతాయార్ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు రావికమతం ప్రాజెక్ట్ కార్యాలయం నుంచి సాయిబాబా గుడి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యకమంలో ఏసీడీపీవో పుష్పదేవి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశుగ్రాస అభివృద్ధిపై అవగాహన

రోలుగుంట: పశుగ్రాస అభివృద్ధి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పశు వైద్యశాలలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోలుగుంట పశు వైద్యాధికారి నూకేశ్వరరావు మాట్లాడుతూ వివిధ పశుగ్రాస అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించారు. ఉపాధి పథకం ద్వారా ఉచితంగా అందిస్తున్న పశుగ్రాస విత్తనాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 75 శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మరో పశు పశువైద్యాధికారి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.